స్కెచ్

# చిత్రకారుడి హృదయం

కాసుఖేల సోమేశ్వరరావు

తనూ ఒక బొమ్మ వేశానన్న మహోత్సాహం మధుని నిద్రకు దూరంచేసింది. అజ్ఞాతమైన ఒక మధుర భావానికా పసిహృదయం దోసిలిపట్టింది. ఏవేవో-హృదయంనిండా, అపూర్వమైన వర్ణ సమ్మేళనాలు: చెట్లూ చేమలూ, నదులూ, కారు చీకట్లూ, ఎర్రటి సూర్యబింబం, తెల్లటి వెన్నెలా మధు ఊహాపథంలో తేలిపోతున్నాయ్. మంచం మీద పడుకుని ఆలోచిస్తున్నాడు. నక్షత్రాలెంత బావున్నాయి. ఎలావున్నాయో పోల్చగలశక్తి లేదు. బావుందని మాత్రం అనుకున్నాడు. అలా పరిగెత్తిపోతాడేం ఈ చంద్రుడూ. తను చంద్రుడి బొమవెయ్యగలడూ. అలా పరిగెత్తిపోతుంటే ఎలా చెప్పూ. కాసేపు నిలబడవూ. మధు కళ్లు చంద్రుడుకేసి దీనంగా చూశాయి. నిశాకాంత ఈ బాలుడి ఆవేదనకు నవ్వింది. నవ్వితే ఆ ముత్యాల పలువరుసలు వెలుగులు గుమ్మరించాయి. నిండు జాబిల్లి ఆ నవ్వులాగున్నాడు. పుటుక్కున ఓ పెద్ద మచ్చ తన్ని కబళించివేసింది. కాసేపు దిక్కులంతా మసక మసగ్గా అయిపోయినై. గోడగడియారం పన్నెండు కొట్టింది. తన ఊహల కంతరాయం కలిగిస్తూ దోమతెరలో నాన్నగారు, గురకాపి పక్కకొత్తిగిలి మళ్ళా గురక మొదలెట్టారు. చిన్నిచెల్లెలు ప్రశాంతంగా పడుకుని ఉంది. పగలంతా కష్టపడి పనిచేసి, అలసిపోయి, అమ్మ నిద్రపోతున్నాది.

మెల్లగా దుప్పటి లాగేశాడు. నులకమంచం కిర్రుమంది. కాసేపలాగే ఉండి పోయ్యాడు. తీవ్రానుభూతుల్లేని హృదయాలు ప్రశాంతంగా నిద్రపోతున్నాయి. నెమ్మదిగాలేచి పక్కగదిలోకెళ్ళి డ్రాయిరు సొరుగులాగి ఓ పుస్తకం బయటికి తీశాడు. పుటలమధ్య ఓ బొమ్మఉంది. తగ్గించిన దీపం వెలుతుర్లో చూశాడు. ఆనందం అతన్ని గిలిగింతలు పెట్టింది. కొండలూ, నదీ, చెట్లూ, సూర్యుడూ, సూర్యకిరణాలూ చూట్టూరా ఒకసారి చూసి మళ్ళా కాసేపు బొమ్మ చూసికొని మురుసుకొన్నాడు. పుస్తకంలో, పెట్టేసి, సొరుగు మూసి, బయటికివచ్చాడు. వస్తూంటే గుమ్మందగ్గర మరచెంబు కాలికి తగిలి ఖంగుమంటూ పడిపోయి ఇటూఆటూ దొర్లసాగింది. అతని గుండె గతుక్కుమంది. తల్లిగొంతు కనిపించింది.

"ఎవరక్కడ"

"నేను"

"ఎవరు మధూ"

"ఆఁ"

"ఏంకావాలి నాయనా"

"ఏంలేదు మంచినీళ్లు తాగుతున్నా"

"జాగ్రత్త నాయనా, చీకటి.
దీపం పెద్దదిచెయ్యి"

మధు అనుకున్నాడు. అంత నిద్రలోనూ తల్లి ఎలా మేలుకుందా అని. అతనికళ్లు రెండూ మంటలెత్తాయి అర్ధరాత్రిదాకా మేలుకొన్నందువల్ల. అర్ధరాత్రి అని అనుకోగానే అతనికి భయమేసింది. ముఖందాకా ముసుగుదన్ని రేపెవరికి బొమ్మ చూపించాలో ఆలోచిస్తూ పడుకొన్నాడు.

కళ్ళు తెరిచేసరికి ఇంకా తెల్లవారుతూంది. అమ్మమాత్రం అప్పుడే లేచిపోయి ఇంటిలోపల కాఫీ కుంపటి రాజేస్తోంది. తనూవెళ్ళి గప్‌చిప్‌గా ముఖం కడుక్కోవటం మొదలెట్టాడు.

అమ్మ చూచించి.

"ఏంనాయనా! అప్పుడే లేచిపొయ్యావ్. మాంచి ఎదిగేవేళ చిన్నపిల్లలు లేకగూడదు."

"నిద్దర్రావటంలేదు."

"రాత్రి నిద్రపట్టలేదా నాయనా"

"ఈమె కెలా తెలిసింది" మధు ఆశ్చర్యపోయాడు.

"ఊహుఁ"

తల్లి వినిపించుకోకుండా తనపని చూసుకోడం మొదలెట్టింది.

అమ్మకు చూపిస్తే తీరాచూసి బాగులేదంటుందేమో. తటపటాయించాడు. మనసు ముందుకు వెనక్కూ ఊగిసలాడింది. చాలాసేపు మథనపడి చివరకు నిర్ణయాని కొచ్చాడు. తల్లికి చెప్దామని.. ముఖం కడిగేసుకొని అమ్మదగ్గరకెళ్ళి నిలబడ్డాడు. గుండె తీవ్రంగా స్పందించింది. కాని ఎందుకో వెంటనే ఉత్సాహం తగ్గిపోయింది.

ఈరోజు స్కూల్లో ముందుగా సుబ్బిగాడికి చూపించాలి. తనంటే వాడికి మా గట్టినమ్మకం. వాడు బాగుందంటే తరవాత వడ్డి కొండడికీ, జిలానీకి, పిట్టలోడికి ఇంకా ఇంకా స్నేహితుల కెంతమందికో చూపిస్తాడు. ఈ హడావుడి చూచి మాష్టారు 'ఏముంది' అని అడుగుతారు ఎవడోలేచి "మధుసూదనరావు బొమ్మ లేశాడు సార్" అంటాడు బొమ్మచూసి 'బేష్' సింగరాజూ అని ఇంటి పేరుపెట్టి పిలుస్తాడు. స్కూలంతా మోగిపోతుంది. అందరూ వచ్చి, ఏదీ మధూ బొమ్మేదీ అని అడుగుతారు. అందులో ఒకడు 'ఎట్లాగైనా అసాధ్యుడురోయ్' మరోడు తెలివి వొకరి అచ్చిసొత్తట్రా... మధు ఊహాపథంలోకి తేలిపోయ్యాడు.

"ఒరేమధూ!" దోమతెరలోంచి నాన్నగారి కేక మధు భావాల బస్సుకి బ్రేకు వేసింది.

"వస్తున్నానండీ" అంటూ పరుగెత్తి నాన్నగారికి కచ్చికానీళ్ళిచ్చి; చెల్లెల్ని లేపాడు. చెయ్యి గిల్లి. ఆ పిల్ల ఆలాపించిన స్వరం ఏరాగం కిస్తుందో సంగీత విద్వాంసులకే తెలియాలి.

* * *

బడికి అరగంట ముందుగావెళ్ళి గేటుదగ్గర ఓ రాయిమీద కూర్చొని సుబ్బడికోసం ఆత్రంగా చూస్తున్నాడు. మాటిమాటికి పుస్తకంలో బొమ్మకేసి, వీధికేసి చూసేవాడు. ఆ సుబ్బిగాడు రానే వచ్చాడు వస్తూనే,

'ఏరోయ్ ఇదెప్పటినుంచీ! అప్పుడే వచ్చేశావ్'

"చెప్తామరి" అంటూ స్కూలుకు వెనకాతల ఓ ఏతాంబావి గట్టుమీదికి తీసికెళ్ళాడు.

"ఏమిటో సంగతి పొలకోవాగాని తెచ్చావే" పుస్తకం తెరచి బొమ్మ చూపించాడు. స్నేహితుడి ముఖంకేసి తీవ్రంగా చూశాడు.

"ఓరి బొమ్మట్రా ఏమిటిదంతా"

"జాగ్రత్తగా చూడరా తెలుస్తుంది కొండలు సూర్యుడు, చెట్లు, నదీ-" ఇంకా చెప్పేవాడేగాని వాడు మాటాడకపోవటం చూచి మానుకున్నాడు.

రెండు నిముషాలు నిశ్శబ్దం పిడుగు పడ్డట్లయి మధు ఉలిక్కిపడ్డాడు.

"ఎక్కడరా కొండలు"

"ఇదేమిటి"

"ఇది కొండలంటావ్"

"అనడమేమిటి, కనబడ్డంలా." మధు తల గిర్రున తిరిగింది.

"నదేదీ"

"ఇదేమిటి"

"నీళ్లేవీ, అడ్డంగా ఈ గీతలేమిటి?"

"బ్రిడ్జి"

సుబ్బడు నవ్వాడు. తననోటినుంచి అప్రయత్నంగా జవాబులొచ్చేస్తున్నాయి. భరించలేని అవమానంతో మనస్సు రసాతలానికి కుదించుకుపోయింది.

చివుక్కున బొమ్మలాగేసి పరుగెత్తిపోయాడు.

పల్లెటూరి వెధవలు అర్థం చేసికోడం తెలీదు. తినమంటే తింటారు. బొమ్మబాగుండదన్నేరూ. అసలు బాగుంటేనా. వాడింతకంటే బాగావేస్తాడా. వాడికసలు రాదుకో. మరినేనో. ఐనా బాగుండవనగూడదూ.

మొదటి రెండుగంటలూ అయిపోయాయి లెక్కలటీచరు వేసిన ప్రశ్నకి సమాధానం చెప్పలేకపోయాడు. "హోమ్‌వర్కు చేశావా!" పాత సంగతులు బయటికి లాగాడు లెక్కలమాష్టారు. చెయ్యలేదందామనుకొని ధైర్యంలేక, ఇంటిదగ్గర పుస్తకంవుంది రేపుచూస్తానన్నాడు. సుబ్బడు పిల్లిలాగావచ్చి సరుక్కున పుస్తకంలో బొమ్మ లాగేసి క్లాసువాళ్ళకంతా చూపించాడు. "ఆ నదులూ, కొండలూ, ఆ చెట్లూ, ఆ సూర్యుడూ, ఆహాహా" అంటూండగా మధువచ్చి మీదబడ్డాడు. సుబ్బడివి ఫిటుచేసి బొమ్మలాక్కున్నాడు. మానిటర్ వచ్చి వీళ్ళిద్దరి పేర్లూ వ్రాసుకున్నాడు.

"ఇదేం బొమ్మరా"

"మా అవ్వ బాగాగీస్తుందింతకంటే."

"అరే పిట్టలోడా, ఈ చెట్టు నీయాలుందిరా"

అందరూ వాడికేసీ, ఆ చెట్టుకేసీ చూశారు.

"దొమ్మలరగ్గొడతా నాయాలా"

సాయంత్రమైంది. బడి వదిలెట్టారు. ఎవరి మానానవాళ్లు పోయారు. అతన్నెవరూ పలకరించ లేదు. అతని స్వాభిమానం దెబ్బతింది. అడుగులు తేలిపోతున్నాయి. ఒకచోట తూలిపడిపోయాడు. చివరికిలా అయిపోయిందేమిటి? ఎక్కలేని దుఃఖం వచ్చింది. ఎదురుగావచ్చే ఆడపిల్లలు చూస్తారేమో అని తమాయించుకున్నాడు. తనకు బొమ్మ వెయ్యడం రాదసలు. పాడుబొమ్మ. చింపిపారేస్తాను. పీడొదిలి పోతుంది.

వెనకనించెవరో భుజంమీద చెయ్యివేశారు.

"బొమ్మ నిజంగా చాలా బావుందిరా, ఎగతాళికోసం అన్నాను. ఏమీ అనుకోవాకు."

అంత తొందరగా పశ్చాత్తాప పడినందుకు మధు హృదయం కదిలిపోయింది.

"ఫరవాలేదులే" అన్నాడు. అంటూ రెండశ్రు బిందువులు జార్చాడు.

ఇద్దరూ మౌనంగా నడిచారు. మధు ఇంటి వద్దకు రాగానే 'వస్తానురా' అని దొడ్డి దారిన దూరాడు.

అడుగడుక్కీ ఇనుపగుదియలు మెళ్లో వేస్తున్నట్టుగా బరువుగా నడుస్తున్నాడు. ఓ వెడల్పాటి బండమీద చతికిలబడ్డాడు. చుట్టుపక్కలెవ్వరూ లేరు. బొమ్మకేసి చూశాడు. తనమీద తనకే అమితమైన చిరాకు గలిగింది. ఏడుపొచ్చింది. కోపమొచ్చింది. ఇహెవ్వరికీ చూపించడు. ఎధవ బొమ్మనిచింపి తగలెడ్డామనుకున్నాడు. గుండె బరువుగా లేస్తూ పడుతూ ఉంది.

ఆ వేడి నిట్టూర్పుల్లో మధు బొమ్మలోని నదీ జలా లిరిగిపోయి ఓ మరుభూమి మిగిలింది. ఆ ఆసమర్థుని కోపంలో బొమ్మలోని కొండలు ఫెడీ ఫెడీమని బండలై, రాళ్ళయి, రాతిముక్కలై, ఇసుక రేణువులై సన్నబడి సన్నబడి, పిండై, మాయమైపోయాయి. ఆ నిరాశా హృదయానికి బొమ్మలోని సూర్యుడు అస్తమించి కారుచీకట్లు తరుముకొచ్చినట్టుగా తోచింది. అతని పదునైన కోపంలో తాటిచెట్లు మొదలంటా నరుకబడ్డాయి. ఇంకేముంది. తనువేసిన బొమ్మెక్కడా లేదు. ఆ కొండలూ, చెట్లూ, సూర్యుడూ చంద్రుడూ ఏ. బొమ్మని రెండుగా చీల్చెయ్యబోయాడు.

"నాకా బొమ్మిమ్మయ్యవ్ బావా!"

"ఫో ఇవ్వను ఫో."

పక్కకి తిరిగిచూశాడు. అత్తకూతురు అరుణ ముద్దుగా నిల్చొని ఉంది. ముఖం చిన్నబుచ్చుకుంది.

"మా అమ్మా నాన్నా అంతావచ్చారు." మధు కళ్లు తుడుచుకుని.

"అరె ఎప్పుడొచ్చావే."

"మధ్యాన్నం వచ్చాం."

"ఊహూఁ"

"నాకా బొమ్మిమ్మయ్యవ్ బావా?"

"బాగుందంటే ఇస్తాను."

"అలాగే. చాలా బావుంది."

అతని హృదయం మళ్ళీ ఆనందంతో నిండింది. బొమ్మ అరుణ చేతికిచ్చి మోకాళ్ళమధ్య తల పెట్టుకొని భయపడుతూ, ఆ చెట్లూ, కొండలూ, సూర్యుడూ అన్నీ చూశావా! నీకు కనబడుతున్నాయా?"

జవాబు రాలేదు.

తలెత్తి చూశాడు. అరుణ లేదక్కడ.

"ఏయ్ అరుణా, అరుణా!" ఇంట్లోకి పరుగెత్తాడు.

ఇల్లంతా మధు బొమ్మ విషయం మోగిపోయింది. మూణ్ణాల పాపాయికి గూడా అరుణ చెప్పేసింది. బావ బొమ్మేశాడని. వాళ్ళమ్మకు వివరించి చెప్పింది ఎక్కడెక్కడ కొండలున్నాయో ఎక్కడ నదుందో, సూర్యు డెలావున్నదీ.

ఆత్తగారు ముక్కుమీద వేలేసి అంది

"అబ్బో! అల్లుడు చిత్రకారుడయ్యాడే" అని.

---

గొప్పవాళ్ళ లోపాలనుకూడా సుగుణాలుగా చిత్రించి, వాళ్ళ తప్పు పనులకు పక్కతాళంవేసి, ఏవి హితవో ఆ సలహాలేచెప్పి పబ్బం గడుపుకోవడం యిచ్చకాలరాయుళ్ళ ప్రత్యేకవిద్య.—మోలియర్